# సింగాడ

చార్మినార్

నా నుజ్జూ సర్పమురా

నాగ

నా రుమాల్ కొంగూరా

నాగ

నాది మురికీ నెత్తురురా

నాగ

చితికిన మూసీ కన్నురా

నా ముప్పై ఏండ్లూ
పది వేలా ముప్పై రాత్రులూ
చర్మం దుప్పటిలో బిర్రుగ కట్టినప్పుడు
గ్నాపకాలు
కొన్ని పగిలి పలుకుతాయి

దిల్‌బహార్‌పై వొక దుఃఖపు పావురం
వేగలేక కూలుతుంది
గుండె నిలువుగా గడ్డకడుతుంది
అన్నీ గడిచినా
అన్నీ వదలవు

సన్నని సీసం పెంకులు
గొంతులో గరగరమంటయ్
సిటీ కదులుతూంటే

ఎటు తిరిగినా వొక బరువుంటుంది
నన్ను నాకుతూనే వుంటుంది
దిగులు నాలుక
బాఘేయామ్ నీడలు
పత్తా పత్తా రాలిన చప్పుడు
వినపడుతుందిరా
మదార్‌సే ఆలియా...
జోగినిలా ఊగేయమ్మా

ఎక్కడ్నించి ఈ బురదంతా...
గండిపేటంతా పాశిపోయింది

గుడిపక్కన కవాలి
దర్గాలో జాతక కతా
చర్చిలో చిందెల్లమ్మా
నాకైతే కనబడుతుంది

గుచ్చుకుంటున్నాయి కలలో పేరిన
కండ్లేనా
వొదిలి పోలేను
వుండనూ లేను
వలసపోవడం ఎంత నరకం
నా గూడుకు నేనే కిరాయి కడుతున్నాను

సింగాడా... నా సింగాడా...
నన్నొదిలిపోకు

నువ్వు నా గ్నాపకం

నా పిట్టల్ సుందరి జడలో పువ్వా

రాలి పోకు

నేను నిన్ను

వెంటాడుతూనే వుంటాను

పత్తే మైదాను లోపల

వొక పున్నామ జన్మమింకా

కాలి పోతూనే వుంది

చెర విడిపించే

కన్న కడుపు కోసం

నా రాంకోఠీ రాగమా

అస్సలాం... వాలేకుమ్

సిద్ధార్థ
(‘బొమ్మలబాయి’ – 1.1.1999)